జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
గురువారం | 30 | జులై | 2026 ◆ పేజీలు : 5



# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్రానికి అసలైన పెట్టుబడి

## మంత్రి పొంగులేటి

- రూ.4.85 కోట్లతో గొల్లగూడెం ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి శంకుస్థాపన
- పేద పిల్లలకు కార్పొరేట్‌కు ధీటుగా నాణ్య మైన విద్య, వసతులు కల్పిస్తున్నామని వెల్లడి
- 'ఉద్దీపకం-3' పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాసరెడ్డి.



2 లో...

# జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం



- ♦ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
- ♦ ఎన్ఎస్‌పీ అతిథి గృహంలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన లెఫ్టినెంట్ గవర్నర్

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి** జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బుధవారం ఖమ్మం జిల్లా పర్యటనకు విచ్చేశారు.జిల్లా పర్యటన సందర్భంగా ఎన్ఎస్పీ అతిథి గృహానికి చేరుకున్న లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఘనంగా స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన కలెక్టర్,అధికారుల తరపున శుభాకాంక్షలు తెలియజేశారు.ఎన్ఎస్‌పీ అతిథి గృహం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ అధికారుల గౌరవ వందనాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ స్వీకరించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి,మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య,ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పారస్‌కుమార్‌లతో పాటు పలువురు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు లెఫ్టినెంట్ గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన లెఫ్టినెంట్ గవర్నర్‌కు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

మిగతా 2 లో...



- దశలవారీగా ప్రతీ కుటుంబానికి మంజూరు
- రూ.21వేల కోట్లతో రైతన్నపై రుణభారం తగ్గించాం
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- ఖమ్మం రూరల్ మండలంలో రూ.7.21 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## మంత్రి పొంగులేటి

**ఖమ్మం రూరల్, ప్రజాజ్యోతి :** ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటనూ తూచా తప్పకుండా అమలు చేస్తుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ ముందుకు సాగుతోందన్నారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఖమ్మం రూరల్ మండల పరిధిలో రూ.7.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. డాక్యా తండాలో రూ.1.41 కోట్లతో మంగళగూడెం–డాక్యా తండా రోడ్డు, పల్లెగూడెంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్.ఎస్.పీ. మీదుగా పల్లెగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి అన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున కేవలం

మిగతా 2 లో...

# కొంగరలో సమగ్ర భూ సర్వే ప్రారంభం



**నేలకొండపల్లి, జులై 29 ప్రజా జ్యోతి:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేను నేలకొండపల్లి మండలం లోని కొంగర గ్రామంలో బుధవారం ప్రారంభించారు. భూ పంచాయతీలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే పథకం లో భాగంగా మండలం లోని కొంగర ను ఎంపిక చేశారు. గ్రామంలో ఉన్న భూములు ఎంత..అందులో ప్రభుత్వం భూమి ఎంత... రైతులకు చెందిన భూములు ఎంత... గ్రామ విస్తీరణం ఎంత...పట్టా భూములు...అసైన్మెంట్ భూములతో పాటు అన్ని రకాల భూములను గుర్తించనున్నారు. ఇప్పటికే గ్రామం మెత్తం కు సరి హద్దులను గుర్తించి రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సర్వే వలన రైతుల మధ్య భూ పంచాయతీ లు ఈ సర్వేతో

మిగతా 2 లో...

# మేరా యువ భారత్, ఖమ్మం ఆధ్వర్యంలో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్

- ముగిసిన 8 రకాల జిల్లాస్థాయి పోటీలు




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయిలో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ అనే అంశం మీద 8 రకాల పోటీలు స్వర్ణ భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా యువజన, క్రీడా అధికారి సునీల్ రెడ్డి యువతను ఉద్దేశించి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా

మిగతా 2 లో...

## కొంగర లో సమగ్ర భూ సర్వే ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి...)

సమిసిపోనున్నాయి. ఈ సందర్భంగా నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ –పాల్గొని..సర్వేయర్, రెవిన్యూ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఆయన మాట్లాడుతూ.. కొంగర గ్రామంలో సమగ్ర భూ సర్వే కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు, జీపీవో ఆశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మేరా యువ భారత్, ఖమ్మం ఆధ్వర్యంలో నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్



(మొదటి పేజీ తరువాయి...)

ఉండాలని, వికసిత్ భారత్ సాధించడానికి యువత పాత్ర చాలా ముఖ్యమని తెలిపారు.జిల్లా స్థాయి పోటీలలో జిల్లా నుంచి వచ్చిన యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఎస్ బి ఐ టి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి మాదకద్రవ్యాలకు లోబడి యువత చెడు మార్గం వైపు వెళ్తున్నారని,ఇటువంటి కార్యక్రమాల ద్వారా యువతలో అవగాహన బాగా వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కవిత్వము, పెయింటింగ్, స్లోగన్ రైటింగ్, ఉపన్యాస పోటీలు,గ్రూపు డాన్స్, గ్రూప్ సాంగ్, షార్ట్ ఫిలిం లేదా రీల్, స్కిట్ పోటీలు నిర్వహించి గెలుపొందిన యువతకు బహుమతులు అందజేశారు. ఈ జిల్లా స్థాయి పోటీలలో మొదటి బహుమతి సాధించిన పెయింటింగ్ – సిహెచ్ లక్ష్మీప్రసన్న, షార్ట్ ఫిలిం,రీల్స్ – ఇ స్వేజన్, కవిత రచన – జి అక్షయ, స్లోగన్ రైటింగ్ – ఎ అనన్య,ఉపన్యాస పోటీలు – బి రమ్యశ్రీ, నాటకం – ఎం గోపిక అండ్ టీం, గ్రూప్ డాన్స్–సిహెచ్ తేజశ్రీ అండ్ టీం , గ్రూప్ సాంగ్ – అలెక్స్ అండ్ టీం. ఈ జిల్లా స్థాయి పోటీలలో మొదటి బహుమతి సాధించిన రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని మేరా యువ భారత్ జిల్లా యువ అధికారి వెంకట రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ డిపార్ట్మెంట్కు చెందిన జిల్లా అధికారి విజయరామ్ కుమార్, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి శ్రీనివాస రావు,మేరా యువ భారత్ అకౌంట్స్ అధికారి కమరతపు భాను చందర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించినందుకుగాను స్వర్ణభారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యాజమాన్యానికి ,న్యాయ నిర్ణీతలుగా వ్యవహరించిన వారందరికీ మేరా యువ భారత్ ధన్యవాదాలు తెలియజేశారు.

## జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాకు ఘన స్వాగతం



(మొదటి పేజీ తరువాయి...)

ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధిపై విస్తృతంగా వివరించారు.జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, సాగునీటి ప్రాజెక్టులు,విద్య,వైద్యం, మౌళిక సదుపాయాల విస్తరణ,గ్రామీణ,పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం తదితర అంశాలపై వివరించారు.అదేవిధంగా జిల్లా భౌగోళిక స్వరూపం, సహజ వనరులు,సాంస్కృతిక వారసత్వం, పారిశ్రామిక అవకాశాలు,ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వివిధ కార్యక్రమాల్లో పాల్గొని, జిల్లా ప్రజల ఆతిథ్యానికి అభినందనలు తెలియజేసిన అనంతరం తన తదుపరి పర్యటన కార్యక్రమాలకు హైదరాబాదు బయలుదేరారు.ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగానికి చెందిన పలువురు అధికారులు, పోలీసు అధికారులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు,ప్రముఖులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి...)

9 రోజుల్లోనే రూ.9,200 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రూ.2 లక్షల వరకు ఉన్న రుణమాఫీ ద్వారా 25 లక్షల మంది రైతులకు రూ.21,000 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గించామని వివరించారు. సన్న వరిధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు.



**నాలుగు విడతల్లో :** నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షలతో కలిపి ఇప్పటివరకు మొత్తం 7 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రెండో విడతలో మిగిలిన గ్రామాలకు త్వరలోనే ఇళ్లు మంజూరు చేస్తామని, రాబోయే మూడో, నాలుగో విడతల్లో అర్హులైన ప్రతీ కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

**మహిళా సాధికారతే ధ్యేయం :** రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని అన్నారు. గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఆగిపోకుండా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ ఛైర్పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్బాబు, పలువురు అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్రానికి అసలైన పెట్టుబడి



**ఖమ్మం రూరల్, ప్రజాజ్యోతి :** "ప్రభుత్వ విద్యా రంగంలో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్యను, అత్యుత్తమ వసతులను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. విద్యార్థుల భవిష్యత్తుపై పెట్టే ఖర్చే రాష్ట్రానికి అసలైన పెట్టుబడి" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.4.85 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు.

**కార్పొరేట్కు ధీటుగా సర్కారు బడులు**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సర్కారు బడులను నాణ్యమైన విద్యకు నిలయాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోందన్నారు. గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో అదనపు వసతి గృహం,డైనింగ్ హాల్,ఆధునిక వంట గది, అదనపు తరగతి గదులు, టాయిలెట్ బ్లాక్లు, సోలార్ ఫెన్సింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్ వంటి మౌలిక వసతులు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. వీటి ద్వారా విద్యార్థినులకు పరిశుభ్రమైన, సురక్షితమైన విద్యా వాతావరణం లభిస్తుందన్నారు.

**చదువే జీవితాన్ని మార్చే శక్తి**

తల్లిదండ్రులు పడే కష్టాన్ని గుర్తుంచుకుని విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు. "పేదరికం కారణంగా ఏ ఒక్కరి చదువు ఆగకూడదనేదే ప్రభుత్వ సంకల్పం. చదువు మాత్రమే మనిషి జీవితాన్ని, సమాజాన్ని మార్చగల శక్తి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను తమ సొంత పిల్లల్లా భావించి, నాణ్యమైన విద్యతో పాటు మంచి నైతిక విలువలను అందించాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు శ్రద్ధ చూపుతున్న ఐటీడీఏ అధికారులను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ రూపొందించిన 'ఉద్దీపకం–3' పుస్తకాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థుల చదువు పూర్తయ్యాక ఉపాధి కల్పనలో మార్గదర్శకత్వం వహించేందుకు 'వారధి' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టనున్నట్లు పీవో వెల్లడించారు. అనంతరం మంత్రి పాఠశాల విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపాలిటీ చైర్పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఖమ్మం రూరల్ తహసీల్దార్ వినయ్ చంద్ర రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడికి నివాళులర్పించిన నాయకులు

- **నివాళులర్పించిన సర్పంచ్ ధీరావత్ అశోకా రాణి.**

**నేలకొండపల్లి, జూలై 29 ప్రజా జ్యోతి.** మండల కేంద్రంలోని మంగాపురం గ్రామం మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బానోతు నరేష్ తండ్రి బానోతు రాందాస్ విద్యుత్ షాక్ కు గురై మరణించారు. వారి పార్థివ దేహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించిన.. సర్పంచ్ దిరావత్ అశోక రాణి ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీ ప్రజా సేవ చేసే నాయకున్ని కోల్పోయిందని అన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి జెర్రిపోతుల అంజని మంగాపురం తండా గ్రామ సర్పంచ్ ధీరవతు అశోక రాణి,రాయిగూడెం సర్పంచ్ బోయిన



వేణు,నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు ధీరవత్ రాధాకృష్ణ ,నేలకొండపల్లి మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు భూక్య చిన్న నాయక్, భూక్యా సీత్యా,భూక్యా గిబ్రియా, పాలేరు నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గట్టి కొండ విజయ్,వంశీ,రాజ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు...

## రాహుల్ గాంధీపై పొంగులేటి సుధాకర్ రెడ్డి వ్యాఖ్యలు

# బీజెపి దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం

- ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే బురదజల్లే ప్రయత్నం
- డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** జంతర్ మంతర్ వేదికగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై బీజేపీ నేతలు చేసిన విమర్శలు వారి రాజకీయ దివాళాకోరుతనానికి, ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేని అసమర్థతకు నిదర్శనమని ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.భావి భారత పౌరులైన విద్యార్థుల భవిష్యత్ తో చెలగాటమాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడే ధైర్యం లేక వ్యక్తిగత విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు.దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల,రైతుల ఆత్మహత్యలు, ఆర్థిక అసమానతలు, మహిళల భద్రత వంటి కీలక అంశాలపై ప్రజలు సమాధానం కోరుతుంటే, వాటిని పక్కనబెట్టి రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకుని చౌకబారు రాజకీయాలు చేయడం బీజేపీ వైఫల్యాన్ని బయటపెడుతోందన్నారు.అబద్ధాలను పదేపదే ప్రచారం చేస్తే అవే నిజాలవుతాయని బీజేపీ భ్రమపడుతోందని విమర్శించారు.రాహుల్ గాంధీ దేశ రాజ్యాంగం,ప్రజాస్వామ్యం,సామాజిక న్యాయం కోసం నిరంతరం గొంతెత్తుతున్న నాయకుడని,ఆయన లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వ్యక్తిగత దాడులకు దిగడం అధికార పార్టీ బలహీనతకు నిదర్శనమన్నారు.విమర్శలకు బదులు వాస్తవాలతో సమాధానం చెప్పే సంస్కృతి బీజేపీకి లేదని ఎద్దేవా చేశారు.జంతర్ మంతర్‌లో జరిగిన కార్యక్రమాన్ని వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఎంత చేసినా సత్యాన్ని దాచలేరన్నారు. ప్రజల అసలు సమస్యలపై చర్చించకుండా ప్రతిపక్షంపై బురదజల్లడం ద్వారా తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ప్రజల తీర్పు అన్నింటికంటే గొప్పదని,అహంకారం, అసత్య ప్రచారం, వ్యక్తిగత దూషణలతో రాజకీయాలు చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని నూతి సత్యనారాయణ గౌడ్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి రాజ్యాంగ పరిరక్షణ, ప్రజా సంక్షేమం కోసం తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.

## ఆగస్టు 1న జాబ్ మేళా

- జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మాధవి
- హరేకృష్ణ చారిటీ చే జాబ్ మేళా నిర్వహణ

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు హరేకృష్ణ చారిటీ వారిచే ఆగస్టు 1న శనివారం రోజున ఉదయం 10 గంటలకు ఖమ్మం టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐ (గౌట్ . ఐటిఐ ) ప్రాంగణంలోని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ (ATC) నందు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్.మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళాలో డిస్ట్రిబ్యూషన్, ప్రొడక్షన్, మెయింటెనెన్స్, మిల్క్ ప్లాంట్ ,క్వాలిటీ, ఐటీ, పర్చేజ్, అకౌంట్స్, ఆపరేషన్స్ విభాగాల్లో ఇన్‌చార్జ్, ఎగ్జిక్యూటివ్, సూపర్‌వైజర్, టెక్నీషియన్, మేనేజర్ తదితర పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.ఐటీఐ,డిప్లొమా,బీటెక్, బీకాం, ఫుడ్ టెక్నాలజీ,కంప్యూటర్స్, హోటల్ హాస్పిటాలిటీ నేపథ్యంతో కూడిన ఏదైనా డిగ్రీ అర్హతలు కలిగి, సంబంధిత అనుభవం ఉన్న అభ్యర్థులు పోస్టును బట్టి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.పోస్టులను బట్టి 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి 20 వేల నుండి 80 వేల వరకు నెలవారీ వేతనం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.అర్హత, ఆసక్తి గల ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల ధృవ పత్రాల జిరాక్స్ కాపీలు తీసుకొని ఆగస్టు 1న శనివారం నాడు నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు హరే కృష్ణ చారిటీస్ హెచ్ఆర్ సెల్ నెంబర్ 9372478 535ను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైదులు మృతి

- రైతు అంత్యక్రియలలో పాల్గొన్న నాయకులు



**నేలకొండపల్లి, జులై 29 ప్రజా జ్యోతి:** స్థానిక మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుడిబోయిన సైదులు అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడు కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. ఆయన మృతదేహం ను పార్టీ మండలాధ్యక్షుడు కొడాలి గోవిందరావు, జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, వెంకన్న, మాజీ ఎంపీటీసీ బొడ్డు బొందయ్య. పసుపులేటి ఉపేందర్, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్ తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ని తెలియజేశారు.ఆశ్రు నయనాల మధ్య రైతు అంత్యక్రియలు.మండలం లోని మంగాపురంతండా లో విద్యుదాఘాతం తో మృతి చెందిన రైతు రామదాసు అంత్యక్రియలు ఆశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. సర్పంచ్లు ఆశోకరాణి, బోయిన వేణు, నాయకులు బచ్చలకూరి నాగరాజు, అంజని, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, భూక్యా చిన్న నాయక్, సీత్యా, కడియాల నరేష్,గట్టిగుండ్ల విజయ్, వంశీ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న జిపిఓ మల్లయ్య



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** మండల పరిధిలోని సఖినవీడు గ్రామంలో కుక్కముళ్ళ సరోజినీ భర్త నాగేశ్వరరావు ఇటీవల క్యాన్సర్ జబ్బుతో బాధపడుతూ మరణించింది విషయం తెలుసుకున్న సఖినవీడు గ్రామ పాలన అధికారీ (జిపిఓ) డి మల్లయ్య మానవత్వాన్ని చాటుకొని ఆపదలో ఉన్న దివ్యాంగుడైన నాగేశ్వరరావు కుటుంబానికి బుధవారం సుమారు 50 కిలోల బియ్యం సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారుఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతిరాల ఈమెలమ్మ నాగేశ్వరరావు సుందరమ్మ పురుషోత్తం నయోమి రమేష్ తదితరులు పాల్గొని జిపిఓ మల్లయ్యను అభినందించారు.

## ఖమ్మం లో ప్రధానమంత్రి విశ్వకర్మ లబ్ధిదారులకు ఒక రోజు మార్కెటింగ్ అవగాహన




**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా కేంద్రంలో ఎం ఎస్ ఎం ఈ – డిఎఫ్ఓ హైదరాబాద్ సమన్వయంతో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్దిదారుల కోసం మార్కెటింగ్ అండ్ బ్రాండింగ్ పై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించదం జరిగింది,ఈ కార్యక్రమం లో మార్కెటింగ్ ,ఫైనాన్షియల్ లిటరసీ, ఈ కామర్స్,ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ పై అవగాహన ఇవ్వడం జరిగింది .ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ కుమార్ ఎం ఎస్ ఎం ఈ ,డీఎఫ్ఓ హైదరాబాద్, రవి ప్రసాద్,ఎల్ డి ఎం , ఎన్ ఎస్ డి సి కోఆర్డినేటర్ ప్రశాంత్, ఐ పి పి బి మేనేజర్ రాజేష్,ఐపిఓ ప్రుధ్వీ,జేఎస్ఎస్ డైరెక్టర్ రాధా కృష్ణ, ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ పవన్ ,మార్కెటింగ్ నిపుణుడు పుష్యమిత్ర పాల్గొన్నారు.

## స్వరూపరాణిని పరామర్శించిన ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి జూలై29(ప్రజా జ్యోతి)** మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డుకు చెందిన చవ్వా స్వరూప రాణి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఆమె ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న, సత్తుపల్లి శాసన సభ్యరాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ వారి స్వగృహానికి వెళ్లి ఆమె ఆరోగ్య పరిస్థితిలపై తెలుసుకొని, జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆమె వెంట మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్,మధు,సన్నీ, నాయకులు ఉన్నారు.

## సర్ ప్రోగ్రాంలో కొత్తూరు గ్రామపంచాయతీ 100% పూర్తి

- ఎమ్మెల్యే సహకారంతో సర్ ప్రోగ్రాం సాధించాము భీమి రెడ్డి సుబ్బారెడ్డి

**సత్తుపల్లి జూలై 29(ప్రజా జ్యోతి)** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఆదేశాల మేరకు, తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో, సత్తుపల్లి శాసన సభ్యరాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహకారాలతో జరుగుతున్న సర్ ప్రోగ్రాం,మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో త్వరితగతిన పూర్తి చేసుకొని ముందంజలో ఉందని,మండల పార్టీ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. కొత్తూరు గ్రామ పంచాయతీలో మొత్తం ఓటర్లు 1082 ఉండగా,943 ఓట్లు ఆన్లైన్ ప్రక్రియ పూర్తయిందని, షిఫ్టింగ్ ఓట్లు 53, మృతి చెందిన వారిని 60, అడ్రస్ లో లేని వాళ్ళవి 15, రెండు చోట్ల ఓట్లు ఉన్నవారిని 11, మొత్తం 139 ఓట్లను గుర్తించి వాటిని తొలగించి సర్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని ముందంజలో ఉంచిన ఘనత కొత్తూరు గ్రామపంచాయతీకి దక్కిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్







ప్రక్రియను వేగవంతం చేసేందుకు సమిష్టి కృషితో సర్పంచ్ అయినంపూడి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గొర్లమారి రామ్మోహన్ రెడ్డి, పాలకవర్గం, సెక్రటరీ పద్మ ,బి ఎల్ ఓ,బిఎల్ఎ లో సహాయ సహకారాలతో, ప్రతి ఓటర్ ని గుర్తించి, వారి ఆన్లైన్ ప్రక్రియ అయ్యేంతవరకు వాళ్లకు తోడుగా ఉండి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినామని ఆనందం వ్యక్తం చేశారు. మన ఓటు మనం కాపాడుకోకపోతే తర్వాత ఓటు ఉండదని పబ్లిక్ లో ముందుగా ప్రచారం అందించి, సర్ ప్రోగ్రాం ని విజయవంతం చేసాము అని తెలిపినారు. 100% సర్ ప్రోగ్రాం పూర్తవుటానికి గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు అధికారులు ఎంతో సపోర్ట్ చేశారని, ఏ కార్యక్రమాన్నైనా సమిష్టిగా చేసుకుంటే ఖచ్చితంగా విజయం సాధిస్తామని వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## మత్స్య సోసైటీ పై న్యాయ పోరాటం చేస్తా

- సోసైటీలో కాంట్రాక్టర్ వ్యవస్థ నడుస్తుంది
- మత్స్య శాఖ అధికారుల పై కలెక్టర్ కు ఫిర్యాదు
- గిరిజన సంఘం నాయకులు పాల్యాకోట్యా



**నేలకొండపల్లి, జూలై 29 ప్రజా జ్యోతి** మండలం లోని చెరువు మాధారం మత్స్యపారిశ్రామక సహాకార సం ఘంలో జరుగుతున్న అక్రమాలపై న్యాయ పోరాటం చేస్తానని తెలంగాణ గిరిజన సంఘం నాయకులు పాల్యా కోట్యా పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకర్ల సమావేశం ను నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడా రు... చెరువు మాధారం మత్స్యపారిశ్రామిక స హకార సంఘం నిబంధనలు ఉల్లంఘించి చేపల వేట కొనసాగించిందన్నారు. సోసైటీ లో కాంట్రాక్టర్ వ్యవస్థ ను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. స్థానికులకు చేపలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇతర ప్రాంతాలకు తరలించారని ఆరోపించారు. మత్స్య సోసైటీ పై మత్స్యశాఖ కు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదన్నారు. ఆ శాఖ అధికారుల నిర్లక్ష్యం పై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారి పై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. చెరువు కు ప్రభుత్వం 5.34 లక్షల చేప పిల్లలను ఉచితంగా అందించిందన్నారు. ఆ చేపల ను మత్స్యకారులు వేట తో జీవనం సాగించాల్సి ఉండగా...సోసైటీ పాలకులు కాంట్రాక్టర్ కు అప్పగించటం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఇటీవల కాంట్రాక్టర్ జరిపిన చేపల వేటలో భారీ ఎత్తున చేపలు పట్టుకున్నారని ఆరోపించారు. జూన్ 30 తో చెరువు లీజ్ ముగిసిందన్నారు. తిరిగి మరోమారు చేపల వేట కోసం అనుమతి కోసం ప్రయత్నిస్తున్నారని అన్నారు. స్థానికులను అదే విధంగా మత్స్యకారులను కూడ చెరువు కట్ట వద్ద కు రాకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయటం ఎంత వరకు సబబు అన్నారు. సోసైటీ తో పాటు, మత్స్య శాఖ అధికారుల పై న్యాయం పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్ చెరువుమాధారం చెరువు పై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

## నేడు సీపీఐ రాజకీయ శిక్షణా తరగతులు

- సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు



**బోనకల్, జులై 29 (ప్రజా జ్యోతి):** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వ ర్యంలో మధిర, బోనకల్, చింతకాని మండలాల పార్టీ సభ్యుల కోసం నేడు బోన కల్‌లోని ఖమ్మం రోడ్డులో ఉన్న ఎస్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు సీపీఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు తెలిపారు. మండల కేంద్రంలోని తూము ప్రకాషరావు భవన్ విలేకరుల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద రావు మాట్లాడుతూ...మూడు మండలాల నుంచి ఎంపిక చేసిన సుమారు 500 మంది పార్టీ సభ్యులు ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలు, ప్రజా ఉద్యమాల దిశ, పార్టీ వైఖరి తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ శిక్షణా తరగతులకు సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డితో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరై వివిధ అంశాలపై బోధించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమయానికి హాజరై శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని యంగల ఆనందరావు కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్య వర్గ సభ్యులు ఆ కె న పవన్, బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, కొంగర భాస్కర్ రావు, గుంపుల జయరాజు, కాకాటి కరుణాకర్ తదితరులున్నారు.

# బోనకల్ లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

- బోనకల్ షిరిడీ సాయి బాబా ఆలయంలో మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు ప్రత్యేక పూజలు



**బోనకల్, జూలై 29(ప్రజా జ్యోతి):** గురు పౌర్ణమి పవిత్ర పర్వదినాన్ని పుర స్కరించుకుని బోనకల్ గ్రామంలోని శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఖమ్మం జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు ఆలయాన్ని సందర్శించి షిరిడీ సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఆశీ ర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమం లో బోనకల్ గ్రామ సర్పంచ్ బానోత్ జ్యోతి, ఉపసర్పంచ్ బానోత్ కొండాతో కలిసి ఆలయంలో నిర్వహించిన గురు పౌర్ణమి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సాయిబాబా వారి ఆశీస్సు లతో ప్రజలందరూ సుఖసంతోషా లతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజు మాట్లాడుతూ... "గురు పౌర్ణమి భార తీయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక పర్వదినం అని, గురువును దైవస్వరూపంగా భావించి ఆరాధించే ఈ రోజు ప్రతి ఒక్కరి జీవితానికి స్ఫూర్తి నిచ్చేదిగా నిలుస్తుందన్నారు. షిరిడీ సాయిబాబా బోధించిన ప్రేమ, సేవ, మానవత్వం, సర్వమత సమానత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచ రించాలన్నారు. సాయిబాబా వారి కృపతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాం తులు, ఐశ్వర్యం కలగాలని మనస్ఫూ ర్తిగా కోరారు.ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయి బాబా దర్శనం చేసుకుని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. గురు పౌర్ణమి సం దర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, భక్తులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బోన కల్ సహకార సంఘం మాజీ అధ్య క్షులు గుండపనేని సుధాకర్ రావు, పారా ప్రసాద్, పంచాయతీ పాలకవర్గ సభ్యురాలు తాళ్లూరు జ్యోతి, రంగా అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ విద్యుత్‌కు స్తంభాలు ఏర్పాటు

- చిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో ఎత్తయిన విద్యుత్ స్తంభాలు
- పనులను ప్రారంభించిన ఉప సర్పంచ్ బానోతు కొండ
- గ్రామంలో ఆధునిక విద్యుత్ సౌకర్యాల దిశగా మరో అడుగు



**బోనకల్, జూలై 29(ప్రజా జ్యోతి ):** బోనకల్ గ్రామపంచాయతీ పరిధిలో సోలార్ విద్యుత్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి చిన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో ఎత్తైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసే పనులను బుధవారం బోనకల్ గ్రామ ఉప సర్పంచ్ బానోతు కొండ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో విద్యుత్ మౌలిక సదుపాయాలను ఆధునికీకరించేందుకు గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఎత్తయిన విద్యుత్ స్తంభాల ఏర్పాటు ద్వారా సోలార్ విద్యుత్ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయడంతో పాటు, విద్యుత్ సరఫరా నాణ్యత మెరుగుపడుతుందని అన్నారు. గ్రామాభివృద్ధి, ప్రజల సౌకర్యాలే లక్ష్యంగా దశలవారీగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఉప సర్పంచ్ కొండ అన్నారు.పనులను పరిశీలించిన ఉప సర్పంచ్ బానోతు కొండ సంబంధిత అధికారుల కు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ గ్రామంలో మెరుగైన విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ 1వ వార్డు సభ్యురాలు యార్లగడ్డ కుమారి, 11 వార్డ్ మెంబర్ ఉప్పర్ శీను, విద్యుత్ శాఖ అధికారులు. సబ్ ఇంజనీర్ హరి ప్రవీణ్ , లైన్ ఇన్స్పెక్టర్ జమీర్ , బోనకల్ లైన్ ఇన్స్పెక్టర్ ఐ సీతయ్య, అసిస్టెంట్ లైన్మెన్ బానోతు రాజేష్, దస్తగిరి, గ్రామస్తులు తేళ్లూరి రమేష్, వెన్నపోయిన వెంకటేశ్వరరావు, జయరాజు, శ్రీను గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమంలో రాజీలేదు

- దాత సహాయంతో ఆరోగ్య కేంద్రానికి ఫ్రిడ్జ్ వితరణ
- సర్పంచ్ ఉమా నరేష్



**కారేపల్లి జూలై 29 ప్రజా జ్యోతి** సింగరేణి మండల పరిధిలోని మాదారం ఉమ్మడి గ్రామపంచాయతీలో ప్రమాదం జరిగితే (కుక్క కాటు పాము కాటు తేలు కాటు ) వ్యాక్సిన్ అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుచున్నారు. మాదారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వ్యాక్సిన్ నిలువ చేసే ఫ్రిడ్జ్ లేక ప్రజలు కుక్క, పాము, తేలుకాటుకు గుర్రై అనారోగ్య పాలై ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయం గమనించిన మాదారం సర్పంచ్ అజ్మీర ఉమా నరేష్ దాతల సహాయం కోరినారు. వెంటనే మాదారం గ్రామానికి చెందిన కిలారు వెంకటేశ్వరరావు దంపతులు సర్పంచ్ అడగగానే20వేల రూపాయల విలువగల ఫ్రిజ్ను బుధవారం ఆరోగ్య కేంద్రానికి వితరణగా సర్పంచ్ చేతుల మీదుగా ఆరోగ్య కేంద్రానికి అందజేశారు. అడగగానే ఫ్రిజ్జు వితరణ చేసిన దాతనుసర్పంచ్ , ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఫ్రిడ్జ్ ఏర్పాటుతో అన్ని రకాల వ్యాక్సిన్ అందుబాటులో ఉంటాయని ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ ద్వారా పాము, తేలు, కుక్క కాటుకు గురైన వారు ఇకనుంచి మాదారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యం చేయించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు గ్రామ అభివృద్ధిలో తమ యొక్క సహాయ సహకారాలు అందజేస్తూ గ్రామాన్ని అభివృద్ధిలో ముందు ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ విజయ్, ఏఎన్ఎం పుష్ప, చందన, కిలారి వెంకటేశ్వర్లు, కాసాని లక్ష్మీనారాయణ, వార్డు మెంబర్లు అజ్మీర శారద, అజ్మీర రజిని, భారతి, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



**వేంసూరు జులై 29 ప్రజాజ్యోతి** గురుపౌర్ణిమ సందర్భంగా వేంసూర్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక సత్యవ్రతాలు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.వెంకటాపురం గ్రామంలోని శ్రీ సాయి శ్రీ శక్తి పీఠంలో గురుపౌర్ణిమను పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు పుచ్చకాయల.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సామూహిక సత్యవ్రతాలు, ప్రత్యేక అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

# ఈ దేశంలోని యువత, విద్యార్థులపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేస్తున్న దమనకాండను ప్రతిఘటించండి

- యువజన కాంగ్రెస్ శ్రేణులకు ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ పిలుపు




**ఖమ్మం ప్రజా జ్యోతి** జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసే కార్యక్రమాల్లో భాగంగా బుధవారం స్థానిక జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజండ్ల సాయికుమార్ అధ్యక్షతన జిల్లా యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఖమ్మం జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, 20 మండలాల్లో గ్రామస్థాయి నుంచి యువజన కాంగ్రెస్ కమిటీల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత పటిష్ఠం చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ సందర్భంగా వేజండ్ల సాయికుమార్ మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో ఖమ్మం జిల్లా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ఇప్పటివరకు ముందుండి పోరాడారని, ఇదే పోరాట స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు.దేశంలోని యువత, విద్యార్థుల గొంతును అణిచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న చర్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువత లేవనెత్తుతున్న సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని కోరారు.అదేవిధంగా, విద్యార్థి–యువజన ఉద్యమాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణలోకి తీసుకుని వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని వేజండ్ల సాయికుమార్ హెచ్చరించారు.యువత సమస్యల పరిష్కారం కోసం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ లు ఖలీల్, బాల గంగాధర్, కోటేష్, ఆదర్శ్ మరియు జిల్లా జనరల్ సెక్రటరీ లు కుక్కల మహేష్, బెల్లంకొండ శరత్ ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్ శ్రావణ్, జిల్లా యువజనకాంగ్రెస్ నాయకులు బోడేపూడి రాజా, కొండూరి హృదయ్ కిరణ్ మరియు అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ లు అంబటి ఈశ్వర్, నితీష్ కుమార్ సన్నీ, ఖైసర్, ఫారుక్, జంగం రాజేష్ మరియు మండల అధ్యక్షులు జనప్రియ కుమార్, రామకృష్ణ, అలకుంట నరసింహారావు, రాకేష్, సతీష్, నిమ్మల నాగేశ్వరరావు, జిల్లా సోషల్ మీడియా కో–కో కోర్డినేటర్ పవన్ కుమార్ రాజు మరియు యువజన కాంగ్రెస్ నాయకులు యడ్లపల్లి తరుణ్, దినేష్, మల్లెలి గాంధీ తదితర యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**కల్లూరు, జూలై 29 ప్రజా జ్యోతి** ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నెలకొన్న విద్య మౌలిక వసతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాఠశాలను సందర్శించి సమస్యలు పరిశీలించారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులతో 35 మంది విద్యార్థులకు 18 సబ్జెక్టులు బోధించడం కష్టంగా మారిందని తాగునీటి సమస్య యూనిఫారాలు పాఠ్యపుస్తకాల పంపిణీలో జాప్యం ఉందని పేర్కొన్నారు. అలాగే భవనం మరమ్మత్తులు కిచెన్ షెడ్ రక్షణ దెబ్బతిన్న మెట్లు డ్రైనేజీ సమస్య కోతుల బెడద వంటి సమస్యలను గుర్తించారు. ఉపాధ్యాయులు ఖాళీల భర్తీ సోలార్ విద్యుత్ కొత్త బ్లాక్ బోర్డులు తాగునీటి సౌకర్యం అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు తన్నీరు కృష్ణార్జున్ రావు, 5వ డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి భాను శ్రీకర్ రైతు సంఘం నాయకుడు మండేపూడి చిన్న నరసయ్య తదితరులు పాల్గొన్నారు

# పి ఆర్ సి వెంటనే ప్రకటించకుంటే ఉద్యమమే

- పి ఆర్ టి యు జిల్లాఅసోసియేట్ అధ్యక్షులు బ్రహ్మ రెడ్డి





**మధిర ప్రజా జ్యోతి** ప్రభుత్వం అధికారం లోకి వస్తే నెలరోజుల్లోనే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తామన్న ప్రభుత్వ పెద్దలు మాట నిలబెట్టు కోవాలనీ ఉపాధ్యాయ శిక్షణా తరగతులు ఇప్పుడు నిర్వహించడం విద్యార్థులకు నష్టదాయకమే పి ఆర్ టి యు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మ రెడ్డి బుధవారం వ్యాఖ్యానించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి30 నెలలు దాటినా కూడా ఉపాధ్యాయ పెండింగ్ సమస్యల పరిష్కారం లో సాచివేత ధోరణి అవలంభించడం శోచనీయమని ఉపాధ్యాయ పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే పి ఆర్ టి యు ఆధ్వర్యంలో త్వరలోనే పెద్ద ఎత్తున ఉద్యమ కార్యాచరణ చేపడతామని జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జెడ్పి హెచ్ఎస్ గర్ల్స్ లో జరుగుతున్న మండల స్థాయి మూడురోజుల ఎఫ్ ఎల్ ఎన్ ఉపాధ్యాయ శిక్షణా తరగతుల్లో ఉపాధ్యాయులనుద్దేశించి అయన మాట్లాడుతూ పి ఆర్ సి పెండింగ్ డి ఎ లు, సిపి ఎస్ రద్దు, పెండింగ్ బిల్లుల విడుదల తదితర సమస్యలను అధికారం లోకి వచ్చిన నెల రోజుల్లోనే పరిష్కరిస్తామని నేడు అధికారం లోకి వచ్చిన ప్రభుత్వ పెద్దలు మాట ఇచ్చారని 30 నెలలు దాటినా కూడా ఉపాధ్యాయులకు మేనిఫెస్టో లో పేర్కొన్న ఏ హామీని కూడా నెర వేర్చలేదని పేర్కొన్నారు.మూడు సంవత్సరాలు దాటినా కూడా పిఆర్సి ప్రకటించకపోవడం బాధాకరమని సెప్టెంబర్ 1 లోగాపిఆర్సి ఇతర సమస్యలను పరిష్కరించకుంటే పిఆర్టియు ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి పి ఆర్ టి యు రాష్ట్ర నాయకత్వంఇప్పటికే ప్రకటన విడుదల చేసిన విషయం ఆయన స్పష్టం చేసారు.హెల్త్ కార్డ్స్ ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసారు.చిల్డ్రన్ బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమానికి విద్యార్థులనుండి, తల్లిదండ్రుల నుండి మంచి స్పందన కనపడుతుందని పేద విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అందించాలన్న ప్రభుత్వ ఆలోచన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని పేర్కొన్నారు.పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కూడా గడవకముందే ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించడం బోధనకు ఆటంకమేనని విద్యార్థులకు నష్టం కలిగించే ఇలాంటి నిర్ణయాలు విద్యా శాఖాధికారులు మానుకోవాలని వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయులకు ట్రైనింగ్స్ నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ వి రవికుమార్,మధిర మండల అధ్యక్షులు చిలుకూరి సత్యనారాయణ రెడ్డి మండల బాధ్యులు పిల్లి నరసింహారావు, ఎం బాబురాజా డి శ్యామలరావు టిడిపి జ్యోతి, ఎంనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- టీఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు




**ఎర్రుపాలెం, ప్రజా జ్యోతి** రాష్ట్రంలోని గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యుటిఎఫ్) ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కంచర్ల శ్రీనివాసరావు, నంద్రు వెంకటేశ్వరరావు లు డిమాండ్ చేశారు.బుధవారం ఎర్రుపాలెం మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని టీఎస్ యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులకు బదిలీలను తక్షణమే నిర్వహించి, కేడరీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, 010 హెడ్ ద్వారా జీతాలు చెల్లించే విధానాన్ని వెంటనే అమలు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి, పదోన్నతులను పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.కేర్ టేకర్ ను నియమించాలని, ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణ ఇవ్వాలని, పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలని 317 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడంలో గురుకుల విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు అనేక సేవా, పరిపాలనా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గురుకుల విద్యారంగంలో పనిచేసే ఉపాధ్యాయుల, ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరించడం వల్ల విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.ఉపాధ్యాయులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించకపోతే టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. గురుకుల విద్యా వ్యవస్థ బలోపేతానికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే మొదటి అడుగని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ ఎర్రుపాలెం మండల ఉపాధ్యక్షులు నీలం సైదారావు పిడి నాగేశ్వరరావు సుబ్బరామరాజు సత్యనారాయణ జీవన్ గురుకుల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఫిన్లాండ్ విద్యా వ్యవస్థ పై నేడు సీఎం సమీక్ష

- సమీక్ష లో పాల్గొనున్న నేలకొండపల్లి యంఈవో
- స్థానిక ఉపాధ్యాయులు ఘన సన్మానం



**నేలకొండపల్లి, జూలై 29 ప్రజా జ్యోతి:** ఫిన్లాండ్ విద్యా వ్యవస్థ పై రాష్ట్ర బృందం జరిపిన ఆధ్యాయన బృందం తో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేయనున్నారు. ఈ మేరకు సమీక్షకు ఫిన్లాండ్ బృందం ప్రతినిధి, నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు హాజరుకానున్నారు. ఏప్రిల్ 18 నుంచి 26 వరకు ఫిన్లాండ్ లో పర్యటించారు. బృందం ప్రతినిధి గా ఉన్న నేలకొండపల్లి యంఈవో చలపతిరావు ను సమీక్షకు హాజరు కావాలని సీయంవో ను ఉత్తర్వలు అందాయి. అక్కడి విద్యా విధానం ను సీఎం కు సమీక్ష లో వివరించనున్నారు. విద్యా లో దూసుకెళ్లేందుకు అక్కడి 'ప్రభుత్వం తీసుకుంటున్న విధి, విధానాలను వివరించనున్నారు. సీఎం' సమీక్ష లో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భంగా బుధవారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో నేలకొండపల్లి మండల ఖ్యాతిని పెంచాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ ఇటిక్యాల సురేష్కుమార్, స్వామి, మాధవ్, శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు టి.వెంగళరావు, బీ.శ్రీనివాస్, తొర్తి సురేష్, కోటేశ్వరరావు, చీనా తదితరులు పాల్గొన్నారు.